వాంటెడ్ ఫాదర్స్

ఆదివిష్ణు

హాస్యనాయిక

ఆదివారం ఉదయం ఈ కథ జరిగింది. అది ఏ ఆదివారమైనా గావచ్చు. ఏవూళ్లోనైనా జరుగవచ్చు.

ఈ కథకి హాస్యమే ప్రధానం గనుక చట్టానికీ న్యాయశాస్త్రానికీ ఇందులో చోటులేదు. బాబ్జీ, చిట్టిబాబూ, సుబ్బారావూ, శ్రీనివాసులూ మరియు రాధ—వీళ్లెవరూ 'లా' చదువుకోలేదు. పోతే, రచయిత దురదృష్టంకొద్దీ ఈ కథకి సంబంధించిన 'లా' మాత్రం చదువుకున్నారు. గనక చట్టం ఒప్పుకపోయినా అందరూ క్షమార్హులే—ఇది రాసేందుకు ఏక కారణమైన మిత్రుడు సత్యమూర్తి గూడాను.

చిట్టిబాబుకి పుస్తకాలు చదవడమంటే చాల యిష్టం. అతను ఆ ఆదివారం ఉదయం పుస్తక పఠనంలో ఉన్నాడు. అన్ని రకాలూ ముగిసాయి. చేరు కవిత్వంమీద దృష్టి నిలిచింది.

బాబ్జీ—లేక—బాబూరావుకి వాళ్ల హెడ్ క్లార్కుని తిట్టడమంటే చాల యిష్టం. అతను ఆ ఆదివారం ఉదయం అదే కార్యక్రమంమీద వాళ్ల అద్దె గదిలోకి సుడిగాలిలా వచ్చేడు.

బాబ్జీ : (వచ్చి అన్నాడు) అధికారంవల్ల కళ్లు మూసుకుపోయిన మనుష్యులంటే నాకు గిట్టదు. ఒకనాడు పురుగులా బ్రతికిన మనిషి సుడి తిరిగి పెద్దాడై వెలిగిపోతూన్నంత మాత్రాన పూర్వం తన పురుగు దశని మరిచిపోతే నేరం. అవునంటావా చిట్టిబాబూ ?

చిట్టి : (పుస్తకంలోంచి తల తిప్పలేదు. పెదవి దాటి మాట రాలేదు.)

బాబ్జీ : అవునయ్యా ! ఆఫీసుకి లేటుగానే వెళ్లాననుకో. ఆపళంగా నన్నంతటివాడిని పట్టుకుని, ఇంత ముక్కుపొడి పట్టించి చేతులు దులుపుకుంటూ, పదిమందిలోనూ నన్ను అడుగుతాడు. 'ఏం బాబూరావూ ! ఇంతాలిస్యంగా వొచ్చావూ ? ఇంటిదగ్గర పిల్లలు ఏడుపేట్టారా వదిలెట్టలేదా ? నాన్నాకాన్నీ నాన్నా అర్ధణా, నాన్నా రూపాయీ అని కాళ్లట్టుకుని ఆపేశారా ? ఏవిటి కథ ?' అని. పట్టుమని పాతికేళ్లయినా నిండలేదు నాకు. పెళ్లి కాలేదు నాకు. పిల్లలు లేరు. ఇవన్నీ తెలుసు శాల్తీకి. అయినా సరే తల తిక్క మాటలు. వొళ్లు మండుకొచ్చింది. మాటంటే పడే రకం కాదు నేను. అభిమానంతో నిండుకున్న గుండెగల వాడిని. నన్నా ఎగతాళి చేస్తాడు? చూస్తా, చూస్తా—వాడి కళ్లముందే గొప్ప బిజినెస్ పెట్టి వాడిని నా కంపెనీలో సేల్సు అసిస్టెంటుగా పెట్టుకుని 'ఏం వాయ్? ఎలా ఉంది ఉద్యోగం' అని అడిగేస్తాను. మన తడాఖా తెలీదింకా.

చిట్టి : (గేయం చదివేడు)

నేను దానవుని సైతం
నిర్జించిన మానవుడను
కాని మానవుని జయించ
లేని లోని మానవుడను ......

బాబ్జీ : (చిట్టిబాబువేపు ఎగా దిగా చూసేడు. వెళ్లికుర్చీలో కూర్చుని టాపువేపు చూపు నిలిపేడు.)

చిట్టి : ఏం రాశాడయ్యా ! కవిత్వమంటే యిలా ఉండాలి. కావల్సినంత తిరకాసుంది యీ నాలుగు ముక్కల్లోనూ. 'నేను దానవుని సైతం—'

బాబ్జీ : (కాళ్లూపుతూ అన్నాడు) కమాన్ మిస్టర్ ధనుంజయరావ్ ! కమాన్.

చిట్టి : (ఉలిక్కిపడి లేచేడు. అటూ యిటూ చూసేడు. ఎవరూ కనుపించలేదు. మళ్లా కూర్చుని అన్నాడు) ధనుంజయరావ్ ఎవరోయ్ బాబ్జీ !

బాబ్జీ : మా హెడ్‌క్లార్కు. నువ్వు కొంచెం నోరుమూసు కూర్చో! (ధనుంజయరావ్ వచ్చినట్టు భావించి అన్నాడు) ఇదేమిటి? వాటీజిట్ ? ఏమిటిది. మీ బొంద డ్రాఫ్టు మీరూను. దీనికింద యువర్స్ ఫెయిత్ఫుల్లీ అని ఎవ డేడవమన్నాడు ? హౌ ఆన్కుడ్ యూ టు వీవ్? (లేచి నించుని షైవ్ కాలుస్తున్నట్టుగా) అవునూ మిస్టర్ ధనుంజయరావ్ మీ వయస్సెంతన్నారు.? గట్టిగా చెప్పవయ్యా. ఛోంచేయలేదా ? ఎంత ? ఫిఫ్టీఫైవా ? ఏభై అయిదు సంవత్సరాలు? నాన్‌సెన్స్—ఈ వయస్సులో మీకు ప్రేమించడా లేమిటయ్యా బొత్తిగా ? మనసంతా ఎక్కడో పెట్టుకుని కాగితాలమీద అవాకులూ చెవాకులూ పేలాారటయ్యా ? ఇదేనా మీ ప్రీవియస్ సర్వీసులో అఘోరించిన తెలివి, నిర్వాకమూను. (ఆయాసం వొచ్చింది.)

చిట్టి : (విసుగుపుట్టింది) ఏమిట్రా తెగ కూసేస్తున్నావ్.

బాబ్జీ : నువ్వు కాస్తాగు చిట్టిబాబూ ! మధ్యలో దోమలాగా బాధపెట్టకు. (మళ్లా ప్రారంభమైంది వ్యూహాగానం) యస్ మిస్టర్ ధనుంజయరావ్ ! మీరు ఫలానా ఆఫీసులో ఎన్నాళ్లు పనిచేశారన్నారూ ? ముప్ఫైఅయిదు సంవత్సరాలా ? హెడ్ గుమాస్తాగానే రిటైరయ్యారా ? వెరిగుడ్. మీ కెవడిస్తాడు ప్రమోషన్. డోంటాక్ మిస్టర్ ధనుంజయరావ్, నామాటకి అడ్డు పడొద్దు. మీ ఆఫీసులో బాబూరావ్ ఫురస్ బాబ్జీ అనే యువకుడు పనిచేసేవాడు గుర్తుందా ? ఉంటుం దుంటుంది. నాకది తెలుసు ముందా చేతులు కట్టుకు నించోడం మానేయండి.

ఆ బుద్ధావతారం ఫోజు నా కిష్టంలేదు. అతి వినయం ధూర్తలక్షణ మన్నారు. ఇంత తిడుతున్నా నేమిటాని బాధగా ఉందా ? అందునా తెలుగులోనే తిడుతున్నా నేమిటని. అవునా ? అవును. ఇవాళ ఏంవార మన్నారు ? మీకు వారఫలాలు చూడటం తెలుసా ? అసలు మీరు తెలుగు పత్రికలు చదువు తారా ?

చిట్టి :(కోపం వొచ్చింది) ఛ .... పోయి పడుకో్ బాబ్జీ ! వెధవ సంధివాగుడూ నువ్వూను. మీ హెడ్ క్లార్కుమీద అంత కోపమైతే, ఏ సందులోనైనా వంటరిగా చూచి రెండు వాయించు. లేదూ, హొటల్ బుహారీకి తీసుకెళ్లి బాగా మేపి మంచి చేసుకో. అంతేగాని, యిలా రోజుకెన్ని గంటల చొప్పున చెప్పి నీలో నువ్వే గొణుక్కోవడం ఏమంత మంచిదికాదు. విశాఖపట్నం వెళ్లిపోగలవ్. జాగ్రత్త

బాబ్జి : అదుగో—వెధవ సొము చెవులూ మీరూను మా ఫ్రెండ్ నా కేదో సలహా యిస్తూంటే వంగి వంగి వింటారెందుకు ? ఇంకా చేతులు నలుపు కుంటూ వింటుంటారేం ? గెటవుట్ ఫస్టయిసే.

చిట్టి : బాబ్జీ! ఎవడైనా చూస్తే నవ్వుతాడు గానీ నోరుమూసుకూర్చో.

బాబ్జి :(కళ్లల్లో నీళ్లు నింపుకున్నాడు) ఎన్నాళ్లని నోరుమూసు కూర్చోన్రా? నన్ను తినేస్తున్నాడ్రా ముక్కుపొడి యమధర్మరాజు.నా నెత్తురు తాగుతున్నాడు. ఏదో ఒక శుభోదయాన ఈ వెధవ వెట్టి చాకిరీకి గాజీనామా యిచ్చి బిజినెస్ పెట్టుకు బ్రతుకుతాను. అప్పటివరకూ నాకు మనశ్శాంతి లేదోయ్ చిట్టిబాబూ !

చిట్టి : పాడు బిజినెస్సూ నువ్వూను. ఆ ముక్క వొదిలెట్టవుగదా ! బోరుకొట్టి ఛస్తున్నాను.

బాబ్జి : (కోపం వచ్చింది) వ్యాపారాన్ని తక్కువ చేయకు చిట్టిబాబూ ! వక్కపొడి తయారుచేసి మేడలుకట్టి నల్లకారుల్లో కిళ్లీలు నములుతూ తిరిగేవాళ్లెవరయినా ఈమాట వింటే నిన్ను నమిలి మింగేయగలరు. ఉద్యోగంలో ఏముందోయ్ వల్లకాడు. నువ్వు చేస్తూన్న గుమాస్తా జీవితం చేదుగా లేదని నీ గుండెమీద చెయ్యి వేసుకు చెప్పగలవా ? లేవు. నాకది తెలుసు. రోజూ మీ హెడ్క్లార్కు—

చిట్టి : నోర్ముయ్. మళ్లా ఆ పేరెత్తావంటే నీ నెత్తురు కళ్లజూస్తాను. జాగ్రత్త. మాకు హెడ్ క్లార్కు లుండ రసలు.

బాబ్జి : పోనీ మరో దిక్కుమాలిన బాస్ ! ఎవడైతే నేం—ఒక మొగుడు. వాడు రోజస్తమానం నీ ప్రాణాలు తోడేస్తుంటే సహించి వూరుకోడం ఎన్నాళ్లు చేస్తావ్ ? జీవితపర్యంతం ఒకడి చెప్పు కింద మల్లెమొగ్గలా నలిగిపోవడం నీ కిష్టమా? కాదు. కనక ....

చిట్టి :(గబగబా లోపలికి వెళ్లబోయేడు.)

బాబ్జి : కనకనే అఖిలాంధ్ర అప్పడాలూ మరియు విస్తళ్ల తయారీ సంస్థకి ప్లాన్ వేస్తున్నాను.

చిట్టి :(ఆగిపోయేడు. ఆశ్చర్యపోయేడు.)

బాబ్జి :(చాలా సీరియస్గా చెప్పేడు.) పేపరు వర్కయిపోయింది. ఇహ అమల్లోకి రావడమే తరువాయి. మా సంస్థ ఉద్దేశాలూ, వాటి సత్ఫలితాలూ నింపాదిగా మనవి చేస్తాను. టూకీగా చెప్పాలంటే ఇటీజవిడోస్ పూల్. విధవలందరికీ ఉపాధి కల్పించడమే ముఖ్యోద్దేశం. రాష్ట్రమంతటా బ్రాంచిలు. వాటికి మేనేజర్లు. అప్పడాలకి, విస్తళ్లకి యీరోజున యింపార్టెన్స్ పెరిగిపోయింది. సాక్ష్యం, కోకొల్లలుగా పుట్టుకొస్తోన్న హొటళ్లు, జనంనూ. ఈ బిజినెస్కి పెట్టుబడి తక్కువ. ఇట్ విల్ స్టార్ట్ విత్ స్మాల్ కేపిటల్. కొన్నాళ్లు స్వయంకృషి అవసరం. నాకు అప్పడాలు చేయడం వచ్చు. విస్తళ్లు కుట్ట గలను. అనాదరణలో క్రుంగిపోయే సుబ్బమ్మలూ, చిన్నతనంలో మొగుళ్లు పోయిన వెంకాయమ్మలూ యీ సంస్థలో ఎంప్లాయీస్.

చిట్టి :(ఇంతవరకూ శ్రద్ధగా వినమూ లేదు. లోపలికి వెళ్లడం ప్రారంభించేడు.)

బాబ్జి : ఒకమనిషి పట్టుదలకొద్దీ హొటల్లో చెయ్యి కడుక్కోడం విడవకపోతే, అతనివల్ల—కేవలం అత నొక్కడివల్ల, రెండు నెలల్లో హొటలు గోడలు మొత్తానికీ సున్నం వేయించవచ్చనే సూత్రాన్ని తీసుకొని వందిమంది—

చిట్టి :(వెళ్లిపోయాడు.)

బాబ్జి : నాన్సెన్స్. వీళ్లెవరికీ బిజినెస్ మజా తెలీదు. గానుగెద్దులా బతకమని దేవుడు రాసిన రాతకి తలొగ్గిన మనుషులు వీళ్లు. (మళ్లా వూహా ప్రపంచంలోకి దిగిపోయేడు) యస్ మిస్టర్ ధనుంజయరావ్! వాట్ డూ యూ వాంట్ నౌ! శెలవా? గట్టిగా చెప్పవయ్యా ? మీ కేమిటి కావాలి. లీవా? అలా గంగిరెద్దులా తలూపకు. నాకు చిరాకు. స్పీక్. మాట్లాడు. నాలుగు రోజుల శెలవా ? నో. ఇవ్వను. ఇవ్వనంతే. ఇంకా నించున్నారే. ఇవ్వనని చెప్పాగా. వెళ్లండి. ఏమిటి మీ మనవడికి జొరమా ? వీకెండింగ్లో ఆఫీసులో మీ ర్లేకపోతే నాకొచ్చే జొరం ఎవరితో చెప్పుకోను ? వెళ్లండి. వెళ్లి మీ పని చూచుకోండి. ఇవాళ సాయంత్రం ఆరుగంటల్లోపు నేను చెప్పిన స్టేట్మెంటు తయారవ్వాలి. ఏమిటి మీ ముక్కు అంత అసహ్యంగా ఉందేమిటి ? ముక్కుపొడి పీల్చడం, ముప్ఫైమూడుసార్లు తుమ్మడం సభ్యత కాదని తెలీదు ? తుమ్మొస్తే కొంచెం నెమ్మదిగా తుమ్మడం నేర్చుకోండి. బంగళా టాపు లేచేట్టు తుమ్మితే ఈ గదిలో వంటరిగా బిక్కు బిక్కుమంటూ కూర్చున్న నా గతేంకాను? అసలీ ఆఫీసులో తుమ్మడా ల్లేవని రేపొద్దున బోర్డు కట్టేయండి. నా కది చూపించి మరీ కట్టండి. వెళ్లండి. యూకెన్గో నౌ !

(సుబ్బారావు వొచ్చి నించున్నాడు. దిగులుగా పిలిచేడు.)

సుబ్బా : బాబ్జి !

బాబ్జి : యస్. కమిన్ !

సుబ్బా : నేను సుబ్బారావుని. కొంచెం తెలివి తెచ్చుకుని మాట్లాడు. నీ పుణ్యముంటుంది.

బాబ్జి : రా గురూ ! రా. ఎంతసేపయింది వొచ్చి.

సుబ్బా : చిట్టిబాబు ఉన్నాడా ?

బాబ్జి : లోపల కవిత్వం చదువుకుంటున్నాడు. వాడూ ఈమధ్య ఏదో రాయాలని ప్రయత్నిస్తున్నట్టు కనుపిస్తోంది. నన్నడుగుతే ఈ రాయడమనేది గూడా—

సుబ్బా :(ఎగతాళిగా అన్నాడు) ఒక గొప్ప బిజినెస్!

బాబ్జి : మంచి మాటన్నావ్. కుర్రాడంటే యిలా ఉండాలి. బాకులాగా మాట నందుకోవాలి. ఇంగ్లీషువాడు బిజినెస్ చేయడాని కొచ్చి రాజ్యాన్నే దోచేడు. అప్పలస్వామి కిళ్లీషాపుతో బిజినెస్ ప్రారంభించి సినిమాహాలు కొని యిప్పుడు సినిమాలే తీస్తున్నాడు. పున్నయ్యశెట్టి చేగోడీలు చేసి నాలుగు హొటళ్లు నడుపుతున్నాడు. రేపొద్దున యీ బాబ్జి లక్షలు గడించేసి—కూర్చోవయ్యా, 'నించునే ఉన్నావ్ ! (కూర్చోపెట్టాడు) నా ప్లానేమిటంటే, అఖిలాంధ్ర అప్పడాలు మరియూ విస్తళ్ల తయారీ సంస్థని...

సుబ్బా : (లోపలివేపు చూసేడు) చిట్టిబాబూ ! తొరగా రా !

బాబ్జి : మధ్య అతనెందుకు మళ్లీ ! అఖిలాంధ్ర అప్పడాలు—

సుబ్బా : అయ్య బాబోయ్ ! నే విన్ను బాబ్జి ! నీ బిజినెస్కీ నీకూ ఓ దండం. (లేచేడు గుమ్మం దగ్గరికి వెళ్లాడు) చిట్టిబాబూ! చిట్టిబాబూ !

(బాబ్జికి కోపం వొచ్చింది. రుసరుసలాడుతూ వెళ్లిపోయేడు, చిట్టిబాబు నవ్వుతూ వొచ్చేడు.)

చిట్టి : వెళ్లిపోయాడ్ట్రా! నా ప్రాణాలు కొరికేస్తున్నాడు వీడు. వీడికేదో పిచ్చెక్కిందని నా అనుమానం. రోజస్తమానం ఆఫీసులో ఎద్దులా పని చేస్తాడా ? దానికేమో వీళ్ల హెడ్క్లార్కు కొంచెమైనా మెచ్చుకోడు. పై పెచ్చు ఖస్సుబుస్సు లెక్కువట. దాంతో వీడి మనసు బేజారెత్తిపోయింది. ఇరవై నాలుగ్గంటలూ ఈ రకమైన గోడు. వీడి స్థితి చూస్తుంటే ఓ పక్క నవ్వూ, మరోపక్క జాలీను.

సుబ్బా : బాబ్జి సంగతి కాసేపలా ఉంచు. నే నిప్పుడు అతి ముఖ్యమైన పనిమీద వొచ్చేను. నీ చేతులూ కాళ్లూ పట్టుకు బ్రతిమాలుకునే స్థితిలో ఉన్నాను. సాయంచేస్తే చర్మం వలిచి చెప్పులు కుడతాను.

చిట్టి : (నవ్వేడు తేలిగ్గా) ఎవడిదిట ? నా చర్మమా ?

సుబ్బా : (సీరియస్గా అన్నాడు) హాస్యం కాదు నాన్నగారూ !

చిట్టి : అదేమిట్రోయ్ ! నేను నాన్నగార్నేమిట్రా నీ బొంద.

సుబ్బా : నాన్నగారూ ! మీరు దీన్ని చాలా సీరియస్గా తీసుకోవాలి. నా దుస్థితి నుంచి నన్ను తప్పించేది మీ రొక్కరే నాన్నగారూ !

చిట్టి : నన్నలా పిలవద్దురా సుబ్బారావూ! వంటిమీద జెర్రులు పాకినట్టుంది. మామూలుగా 'చిట్టిబాబూ' అనే పిలు.

సుబ్బా : చిట్టిబాబు నాన్నగారూ ! నన్నపార్థం చేసుకోవద్దు. నేను చెప్పేది విని—

చిట్టి : వినను. వినను. నువ్వు నాకు కొడుకువు కాదు. నేను నీకు తండ్రినీ కాదు. ఫో .... ముందీ గది దాటు.

సుబ్బా : ఇది తెలుగు సినిమాకాదు నాన్నగారు! నిజమైన జీవితాలు మనవి. మీరు నాకు నాన్నగారే. సాక్షాత్తు దైవస్వరూపులు.

చిట్టి : (కోపం వొచ్చింది) ఏమైనా తాగొచ్చేవేమిట్రా సన్నాసీ ! మీ నాన్నగారికీ విషయం తెలుస్తే నీ డొక్క చింపేగలరు. వెళ్లు, ఆదివారం హాయిగా అనుభవించు. వెళ్లిపో.

సుబ్బా : వెళ్లను గాక వెళ్లను. మీ పాద పద్మాలను దాటి ఒక్క అంగుళమైనా కదలను నాన్నగారు. నన్ను చంపండి, కొట్టండి, తిట్టండి మిమ్మల్నొదిలి నేను వెళ్లను. నా కథ వింటె....

చిట్టి : ఇంతవరకూ బాబ్జిగాడు బోరి వెళ్లేడు.

వాంటెడ్ ఫాదర్స్

ఇప్పుడు నువ్వు తయారయ్యావుట్రా. ఏమిట్రా నీ కథ !

సుబ్బా : నాన్నగారూ !

చిట్టి : ఛీ ! నోర్మూయ్! ముందా కథేమిటో చెప్పి చావు.

సుబ్బా : నా కథ వింటారా నాన్నగారూ !

చిట్టి : ఇంకోమాటు ఆ పేరుతో పిలుస్తే దవడపళ్ళు రాలగొడతాను.

సుబ్బా : నేను ప్రేమించాను నాన్నగారూ !

చిట్టి : అఘోరించక పోయేవు.

సుబ్బా : తప్పేముంది నాన్నగారూ ! తండ్రి పోలికలే కొడుక్కొస్తాయి. మీరు రాధమ్మగార్ని ఎంత పవిత్రంగా ప్రేమించేరో నేనూ అంత పవిత్రం గానే ప్రేమిస్తున్నాను నాన్నగారూ !

చిట్టి : మధ్యలో పోలిక లెందుకోయ్. ప్రేమించావ్. అయితే నన్నేం చేయమంటావ్.

సుబ్బా : సాయం చేయమంటాను నాన్నగారూ ! సాయం.

చిట్టి : మధ్యలో నా సాయ మేమిటోయ్. డైరెక్టుగా వెళ్ళి ఆ పిల్లతో నీ ప్రేమ సంగతి చెప్పు.

సుబ్బా : చెప్పేను నాన్నగారూ ! ఒప్పుకుంది.

చిట్టి : అయితే మీ పెద్దాళ్లతో చెప్పి, వాళ్ల పెద్దాళ్లతో చెప్పించి—

సుబ్బా : అన్నీ అయ్యేయి నాన్నగారూ ! నన్ను చెప్పనివ్వండి పూర్తిగా. (ప్రారంభించేడు.) మా యింటిప్రక్క మీసాల పోలీసాఫీసరుగారు మీకు తెలుసుగా.

చిట్టి : తెలుసు. ఆయన్ని ప్రేమించేవా ?

సుబ్బా : బోడివిట్లు చేయకండి నాన్నగారూ! నే చెప్పేది వినండి. వాళ్లమ్మాయి జ్యోత్స్నని ప్రేమించేను. మనసిచ్చేను. జ్యోత్స్న మనసూ సంపాయించేను. మా యిద్దరి ప్రేమా—నాన్నగారి ముందు నాకు సిగ్గెందుకు— వెన్నెల్లా చల్లగా, వెన్నలా మెత్తగా, మధువులా తీయగా—

చిట్టి : నీ బొందలా చేదుగా... ఆపవోయ్ వెధవ కవిత్వమూ నువ్వూను (సిగరెట్టు తీసి ముట్టించబోయేడు.)

సుబ్బా : వొద్దు నాన్నగారూ ! మీరిక సిగరెట్లు కాల్చరని రాధమ్మగారనుకుంటున్నారు. మీరు సిగరెట్లు కాల్చకూడదు. కేన్సరొస్తుంది. చచ్చిపోతారు. ఆ సిగరెట్టు నా మొహాన్న కొట్టండి. నేను కాల్చుకుంటాను.

చిట్టి : నోర్మూయ్.

సుబ్బా : నా మాట వినండి నాన్నగారూ ! ఆ పాడు సిగరెట్లు మీరు కాల్చకండి. ఈ వయస్సులో అది మంచిదికాదు. అసలే మీ ఆరోగ్యం అంతంత మాత్రం.

చిట్టి : (విసుగు పుట్టింది. సిగరెట్టు కాల్చకుండానే చెప్పుకింద పెట్టి నలిపేడు) ఛీ. చంపేస్తున్నావురా సుబ్బిగా. సరి. నీ ఏడుపేదో చెప్పు.

సుబ్బా : నేను జ్యోత్స్నని ప్రేమించేను.

చిట్టి : అది చెప్పేవ్.

సుబ్బా : మా పెద్దవాళ్లూ, వాళ్ల పెద్దవాళ్లూమా మా పెళ్లికి వొప్పుకున్నారు నాన్నగారూ !

చిట్టి : అయితే యింకేం. ఎంచక్కా పెళ్లి చేసుకోండి. మీ పెళ్లికి మేమూ వస్తాం.

సుబ్బా : ఎంతమాటన్నారు నాన్నగారూ ! మా పెళ్లి మీ రాకుండా ఎల్లా జరుగుతుంది ? మీ చేతుల మీదుగానే మా పెళ్లి జరగాలి. నన్నో యింటివాడిని చేసే బాధ్యత మీది.

చిట్టి : మళ్లా యిదేం తలతిక్కరా బాబూ !

సుబ్బా : నాకో అన్నయ్య ఉన్నాడు నాన్నగారూ వాడు వేదాంతి. ఈ పెళ్లి, ఈ పెళ్లాం, ఈ జీవితం, ఈ ప్రపంచం అన్నీ మిథ్య అని చెప్పి యింట్లో వో మూల కూర్చుని గోళ్లు గిల్లుకుంటున్నాడు. వాడికీ జీవిత కాలంలో పెళ్లికాదని నాకు తెలుసు. పెద్దవాడు—వాడికి పెళ్లికాందే నేను పెళ్లి చేసుకోరాదని మా యింట్లోవాళ్ల నిర్ణయం. నా పెళ్లికి వాడి పెళ్లి ముడి. ఈ ముడి విడదు. నా ప్రేమా, నా జీవితం, నా కలలు, నా ఆశలు అన్నీ వృథాయేనా నాన్నగారూ ! అందుచేత.

చిట్టి : వూం. అందుచేత.

సుబ్బా : మీరే నా నాన్నగారు !

చిట్టి : ఇదేమిటి ?

సుబ్బా : చిన్నమార్గం. నా ఆనందమయ జీవితమనే తాళం కప్పకి విలువైన తాళంచెవి మీరు. నన్ను దత్తత తీసుకోండి. మీ కొడుగ్గా స్వీకరించండి. నా పెళ్లి మీరు చేసిపెట్టండి. మా అన్న సన్యాసుల్లో చేరి తిరిగినా నా కప్పుడు ఇబ్బంది ఉండదు. కానీ జ్యోత్స్న లేని ఈ జీవితంలో వెలుతురుండదు. నన్ను కనికరించండి నాన్నగారూ! దత్తత చేసుకోండి. నాకో కొత్త జీవితాన్ని ప్రసాదించండి.

చిట్టి : (ఖంగారు పుట్టింది) వెళ్లిపో సుబ్బిగా! తొరగా వెళ్లిపో. ఈ విషయం ఎవరో నైనా చెబితే నవ్వుతారు గానీ ఎవరో చెప్పకు. వెధవ అయిడియాలూ నువ్వూను.

సుబ్బ : నవ్వుతారా నాన్నగారూ ! ఎవరు నవ్వుతారు ? ఎందుకు నవ్వుతారు ? నాకు పెళ్లవుతుందని నవ్వుతారా ? జ్యోత్స్న నాకు భార్య అవుతుందని నవ్వుతారా ?

చిట్టి : అదేం కాదురా బాబూ ! నేను నీ బాబునవుతానని! నీకెన్ని గుండె లున్నాయిరా సుబ్బారావూ! ఈ ప్రపంచంలో నీ కింకెవరూ దొరకనట్టు నాకు వలవేశావా ? నాకు దత్తతతో అవసరమేమి టసలు? వయస్సు ముదిరిపోతున్న ముసలితాతనా ? కాదే ! పెళ్లయి ఇరవై సంవత్సరాలు ముగిసినా నలుసు కలగని దురదృష్టవంతుడినా ? కాదే ! అథవా నువ్వేమైనా పసిపిల్లవాడివా ? కావే ! పోనీ, నాకేమైనా పెళ్లంటూ అయ్యిందా ? లేదే.

సుబ్బ : అబ్బబ్బ .... నాన్నగారూ ! మీ పసితనం చూస్తుంటే నవ్వొస్తుందండి నాకు. నన్ను దత్తత చేసుకోమని అడిగేను. నిజమే. దానికి మీరు చెప్పిన కారణాలు ఏవీ గావు— అవునని నేనూ, కాదని మీరూ వాదించుకునేందికి. నా పెళ్లి జరగాలి. జ్యోత్స్న నాకు కావాలి. మా అన్నయ్యకీ జన్మలో పెళ్లికాదు. ఇలాంటి పరిస్థితిల్లో నాకు నాన్నగారు కావలసి వచ్చేరు. అందుచేతనే మిమ్మల్ని ఆశ్రయించేను నాన్నగారూ! రాధమ్మతో మీ పెళ్లి జరగబోతోంది. అంతవరకూ నేనూ ఆగుతాను. మీ పెళ్లి ముగిసిన నెల రోజుల్లో తీరుబడి చిక్కాక తర్వాత నన్ను దత్తత చేసుకోండి. నన్నో యింటివాడిని చేయండి. అది చాలు నాన్నగారూ !

చిట్టి : అది నా చేతకాదు. ఎవరైనా వింటే నన్ను ఎగతాళి చేస్తారు. నువ్వు చావుగాక! అంత తెలివితక్కువ పని నే నసలు చేయను. రేపొద్దున రాధకీ సంగతి తెలుస్తే ఏమైనా ఉందా ? హవ్వ !.... మీ అంత కొడుకు మన కప్పుడే యెందుకండీ అని నన్ను యాగీ చేయగలదు. నువ్వు నన్ను నాన్నగారూ అని పిలిచినా నేను సహించి వూరుకుంటున్నాను. కానీ రాధని అమ్మా అని పిలుస్తే, రాధ రెండో రోజు నూతిలో దూకి చస్తుంది. వెళ్లిపో సుబ్బారావ్. నీ పెళ్లి నా చావుకొచ్చింది. నా బ్రతుకు చీకటి చేయకు. ఆ పాడు కోరిక కోరకు. వెళ్లు.

సుబ్బ : వెళ్లను నాన్నగారూ ! ఏమైనా సరే





వాంటెడ్ ఫాదర్స్

వెళ్లను. మీరు నాకు అభయహస్త మివ్వాలి. నేను వెళ్ళాలి. మీ కొడుకు భీరువుకాదు. పట్టుదల మూర్తీభవించిన ఘనుడు. సరే కానీండి నాన్నగారూ ! నే నిలాగే యీ గదిలోనే ప్రాణాలు సైతం విడుస్తాను గానీ మీచేత కాదనిపించుకుని వెళ్లలేను.

చిట్టి : ఇదెక్కడి ఖర్మంరా తండ్రీ ! చంపేస్తున్నావురా సుబ్బారావూ !

సుబ్బ : కొడుకు తండ్రిని చంపలేడు పైపెచ్చు మీ కున్నావు నరకాన్ని నామరూపాలు లేకుండా చేస్తాడు. నన్ను దత్తత చేసుకొని ఆ నరకాన్నుంచి తప్పించుకోండి నాన్నగారూ !

చిట్టి : ఏమైనా సరే నువ్వు నాకు కొడుకువి కాదు. అవుట్. గెటవుట్.

సుబ్బా : (కోపం వొచ్చింది) సరే—నాన్నగారితో పాటు మాట పెంచుకోడం కొడుకు చేయదగ్గ పని గాదు. వెడతాను. సరాసరి మా కాబోయే మావయ్య దగ్గరికి వెడతాను. ఆయన మీసాల పోలీసాఫీసరు. ఈ వూళ్లో సరసతిని చలికాలంలో రగ్గులా కప్పుకున్న మనిషి. వెళ్లి యీ ఉదంతమంతా చెప్తాను. ఫలానా నాన్నగారు నా కన్యాయం చేయడం మూలంగా నేను మీ పుత్రికారత్నాన్ని పెళ్లిచేసుకో లేకపోతున్నానని చెప్పేస్తాను. ఆ తర్వాత క్షణం నుంచి ప్రారంభమవుతుంది వేట. వేట నాన్నగారూ ! పోలీసువాళ్లు తలుచుకుంటే ఒక మంచి మనిషి బ్రతుకు పదుగురి నోళ్లలో పడి నానిపోవడం ఏమంత దుస్సాధ్యమైన కార్యంకాదు. మీమీద సవాలక్ష కేసులు బనాయించగలరు. పది రోజుల్లో మీ అత్యాచారాలు మా రాధమ్మగారికి తెలుస్తాయి. 'ఛీ' అని లోనొకమాటు అనుకుని పై కొకసారి మీ మొహమ్మీదనేసి తలుపేసేసి పొమ్మంటుంది. దాంతో మీ పెళ్లి ఆగిపోతుంది. అనక విచారించి నా దగ్గరికొచ్చి 'ఏమిటిది కొడకా ! నాకో దారి చూపించు నాయనా!' అని గొడవ చేసినా లాభముండదు. కాబట్టి బాగా ఆలోచించి వో నిర్ణయానికి రండి నాన్నగారూ ! ఆలోచించండి.

చిట్టి : ఒరేయ్ ! ఎంత గొడవ తెచ్చిపెట్టావురా సుబ్బారావూ ! ఇప్పుడీ పరిస్థితుల్లో నన్నేం చేయమంటావురా బాబూ !'

సుబ్బా : నన్ను దత్తత చేసుకుంటానని మాటివ్వండి. మీ చేతులు కళ్ల కద్దుకు వెళ్లిపోతాను. నా చేతనైన విధంగా యీవేళ మీకో సన్మానం చేసుకుని పుత్రధర్మాన్ని పాటిస్తాను. మాటివ్వండి నాన్నగారూ ! ఆలస్యం చేయకండి.

చిట్టి : (ఒప్పుకోక తప్పిందికాదు) సర్లె. వెళ్ళు. ఈ విషయాన్ని ఎవరోతోనూ చెప్పకు.

సుబ్బా : ధన్యుడ్ని నాన్నగారూ ! నా కిప్పుడు ఆనందంగా ఉంది. మా నాన్నగారు ....

చిట్టి : నీటికి మాటికి నన్నా పేరుతో పిలుస్తే గొంతు పిసికేస్తాను. జాగ్రత్త. రేపు ఎవరోనైనా ఫలానా మనిషి నీకు ఫలానా అని చెబితే నా తల కొట్టేసినంత పనవుతుంది. వెళ్లింక.

సుబ్బా : థేంక్స్ నాన్నగారూ !

చిట్టి : అదుగో మళ్లా ! వెళ్లిపో. ఇక్కడే నించుని నా ప్రాణాలు తీయకు. వెళ్ళు.

(సుబ్బారావు పరుగెత్తుకుంటూ వెళ్లిపోయేడు)

చిట్టి : అబ్బ ! గాలీ వాన వెలిసింది. దుంపతెంచి వెళ్లిపోయేడు వెధవ. వీడికీ పాడుబుద్ధి ఎలా పుట్టిందో గానీ ఇంజనీరు అనిపించుకున్నాడు మొత్తానికి.

(బాబ్జి మొహం తుడుచుకుంటూ వచ్చేడు. తనే వెనగ్గా హెడ్‌క్లార్కు వస్తున్నట్టు భావించి విసుక్కున్నాడు.)

బాబ్జి : మిస్టర్ ధనుంజయరావ్ ! నా వెనకలా బాడీగార్డులా తిరక్కపోతే మీ యింటి కెళ్లిపోరాదూ! మీవాళ్లు మీకోసం ఎదురుచూడరటయ్యా. ఆఫీసై రెండుగంటలు అయ్యింది. నాకూడా తిరగటానికి మీకు సిగ్గు వెయ్యడంలేదు. ఇంక మీరేం చెప్పొద్దు. మీ గుర్తించి నాకు చాలా తెలుసు.

చిట్టి : (బాబ్జి వేపు ఎగాదిగా చూచి అన్నాడు.) వ్వూ .... వీ డోహడు. పిచ్చిమాలోకం. అస్తమానూ. యీ పారాయణంతో నన్ను అదరగొట్టేస్తున్నాడు.

బాబ్జి : (కూర్చున్నాడు) యస్ మిష్టర్ ధనుంజయరావ్ ! మీ శెలవు విషయం రేపు ఆలోచించి చెప్తాను. మీరు వెళ్లిపోవచు. బైట వెంకాయమ్మ నించుంది కాబోలు రమ్మని చెప్పండి. వెళ్లండి! దట్సాల్‌రైట్.

చిట్టి : (కుతూహలం కలిగింది) వెంకాయమ్మ ఎవ్వరా బాబ్జి !

బాబ్జి : యంగ్ విడో. బ్యూటీఫుల్ ఎంగ్ విడో. మొగుడు మిలట్రీలో చేరి దేశంకోసం ప్రాణా లర్పించేడు. వెంకాయమ్మ నా పర్సనల్ అసిస్టెంట్. అఖిలాంధ్ర అప్పడాలూ మరియూ విస్తళ్ల తయారీ సంస్థ యజమానికి ఆంతరంగిక కార్యదర్శి. (వెంకాయమ్మ వచ్చినట్టు వూహించేడు.) కమిన్ వెంకాయమ్మ. కమిన్. కాకినాడ బ్రాంచివాళ్లు పదివేలకి చెక్కు పంపేరు. ఆ బ్రాంచి మేనేజరు సంతకం సరిగ్గా లేదు. అది వెంటనే రిటర్న్ చేస్తూ చార్జిషీటు ఇవ్వండి. అతని సంజాయిషీ నాకు వారం రోజుల్లో చేరాలి. చెక్కు బీరువా దగ్గరుంది. తీసుకోండి. అన్నట్టు ఆ బీరువాకి కొంచెం తలతిక్క ఉన్నట్టు తెలిసింది. కొంచెం వళ్లు దగ్గరెట్టుకుని పనిచేయమన్నానని చెప్పండి. ఇది ఫైనల్ వార్నింగని గూడా గుర్తు చేయండి. అవునూ—ఆ మునిరత్నమ్మ శెలవు ఎప్పుడు పూర్తవుతుందిట. రేపు మండేతోనా ? ఆవిడ ప్రోగ్రెస్ ఏం బాగోలేదు. హెచ్చరించండి.

చిట్టి : ఇక వీ డింతలో బిజినెస్ నుంచి బైట పడడు. (లేచి నించున్నాడు.)

బాబ్జి : కూర్చోరా ! యస్ వెంకాయమ్మా ! మీరిక వెళ్లచ్చు. నా గదిలోకి మరెవర్నీ పంపించకండి. మా ఫ్రెండ్‌తో సొంత విషయాలు మాట్లాడుకోవాలి. దట్సగూడ్.

చిట్టి : (నిజం చెప్పేడు) ఒరేయ్ నీ హడావిడి చూస్తూంటే నాకే మతి పోతోంది. పాపం నీ కెలా ఉందో ఏమిటో ? నువ్వింత హంగామా చేస్తున్నావా—ఒక్కోమాటు ఇదంతా నిజమే ననుకుని గాభరా పడిపోతాను. పోనీ వో సారి బుచ్చిరెడ్డిగారికి కనిపించకూడదూ.

బాబ్జి : ఎవరాయన ?

చిట్టి : మెంటల్ స్పెషలిస్టు. ఎన్నో పెద్ద పెద్ద కేసులు క్యూర్ చేశారు. నీది ముదిరిపోయిన పిచ్చి కూడా కాదు కాబట్టి.

బాబ్జి : ఏడిశావ్‌లేవోయ్ ! అకాడికి నువ్వో పెద్ద మతున్న మనిషైనట్టు. నన్నడుగుతే ఈ భూమ్మీద

ప్రతికే ప్రతి ప్రతీ పిచ్చిదేనని చెప్తాను. లేపోతే మా హెడ్‌క్వార్ట్సు—

చిట్టి : నే వినను ఆ కథ.

బాబ్జి : ఆయన కాపోతే మరో దామోదర్రావ్. పుట్టడం తర్వాత చచ్చేది పచ్చి నిజమని అందరికీ తెలిసిందే కదా ? ఇవాళ రేపు అనే కాలం మధ్య వాయిదాలు వేసుకుంటూ బ్రతుకున్నవాళ్ళం మనం. అవునా. ఇంత భాగ్యానికే ఒహడ్ని మరోహాడు మోసం చేయడం, రాచి రంపాన్న పెట్టడం, కడుపు కొట్టడం, ఖూనీలు చేయడం—ఇవన్నీ తెలివుండే చేస్తున్నా డంటావా ? కాబట్టి చిట్టిబాబూ మనందరం ఏదోరకంగా పిచ్చివాళ్ళమేనోయ్.

చిట్టి : ఇప్పుడే. నువ్వొచ్చేముందు సుబ్బారావు వెళ్ళిపోయేడు.

బాబ్జి : చూసేను. నే నున్నప్పుడు నీకోసం వొచ్చేడు.

చిట్టి : వెధవ పెద్ద యిరకాటంలో పెట్టి వెళ్ళేడు.

బాబ్జి : ఏమిటో కథ ?

చిట్టి : ఏముంది వాడిని నేను దత్తత చేసుకోవాలిట.

బాబ్జి : వాట్ ! నీదగ్గరేమాత్రం ఆస్తి ఉందేమిటి ?

చిట్టి : నువ్వొహడివి. చెప్పేది పూర్తిగా విను. వాడో అమ్మాయిని ప్రేమించేడు. వీళ్ళిద్దరి ప్రేమనీ అటూ యిటూ పెద్దవాళ్ళు ఆమోదించి పెళ్ళి కొప్పుకున్నారు. అవుతే సుబ్బారావుకి వో అన్నయ్యున్నాడు. అతనికి పెళ్ళిమీద మోజులేదు. అంచేత అతను పెళ్ళి చేసుకోడు. అతని పెళ్ళికాందే సుబ్బారావుకి పెళ్ళి కాదు. అందుచేత దత్తతకి పోయి మరో అయ్య చేతిమీదుగా తన పెళ్ళి చేయించుకోవాలని సుబ్బారావు ఉద్దేశం. వాడి ప్లాను నా మీదకి పారింది. నా పెళ్ళయిం తర్వాత సుబ్బారావుని నేను దత్తత చేసుకోవాలిట.

బాబ్జి : బాగుంది. మంచి బిజినెస్. ఇంతవరకూ కనీ వినీ ఎరుగని సరికొత్త బిజినెస్. ధన్యుడివి చిట్టిబాబూ ! నీ రొట్టి విరిగి నేతిలో పడ్డది.

చిట్టి : అవు. నీ బిజినెస్సూ నువ్వూ కలిసి గంగలో దూకండి. నేనోపక్క చిక్కు సమస్యతో సతమత మవుతూంటే మధ్య నీ బోడి బిజినెస్సేవిటోయ్ !

(ఆవేళకి శ్రీనివాసులు బిక్కు బిక్కుమంటూ వచ్చి నించున్నాడు. అతని చూపులో దిగులు తాండవిస్తోంది.)

చిట్టి : ఏమిటోయ్ శ్రీనివాసులూ ! ఇలా వచ్చేవ్ ?

బాబ్జి : దివాలా తీసినట్టు ఆ పోజేమిటోయ్.

శ్రీను : (చిట్టిబాబువేపు చూసేడు దిగులుగా).

చిట్టి : ఏమైం దేమిటి ?

బాబ్జి : ఇంటిదగ్గరంతా కులాసాయేనా ?

శ్రీను : (చిట్టిబాబు వేపే చూస్తున్నాడు.)

చిట్టి : తొరగా చెప్పి చావు. సస్పెన్స్ ఎందుకు ?

శ్రీను : (ఏడుస్తూ అరిచేడు.) డాడీ !

చిట్టి : (ఉలిక్కిపడ్డాడు) ఏమిటోయ్ మీ నాన్నగారు కులాసాయేనా ?

శ్రీను : క్షేమమే డాడీ ! అందర్నూ క్షేమమే. నేనే మతిపోయి తిరుగుతున్నాను.

చిట్టి : (భయం వేసింది) నీకు సుబ్బారావు కనిపించాడా ?

శ్రీను : అవును డాడీ !

బాబ్జి : డాడీ ఏమిట్రోయ్ చిట్టిబాబూ !

చిట్టి : నా కొంపతీశాడు బాబ్జి ! సుబ్బారావు నీతో ఏమైనా చెప్పేడా శ్రీనివాసులూ !

శ్రీను : మీరు యువ ప్రపంచానికి చేస్తున్న సేవ శ్లాఘనీయం డాడీ ! మీ ఋణాన్ని మే మెలా తీర్చుకోగలం.?

చిట్టి : (నిట్టూర్చేడు) విన్నావుట్రా బాబ్జి ! వీడు రెండోవాడు. మా చిన్నబ్బాయ్ శ్రీనివాసులు.

శ్రీని : (ఆనందంగా అన్నాడు.) అది చాలు డాడీ ! ఆమాట చాలు. వస్తా (వెళ్ళబోయేడు).

చిట్టి : (కోపంగా అరిచేడు) ఆగు. ఎవడ్రా నీకు డాడీ ! చెప్పు. ఆ సుబ్బారావుగాడితోనూ చెప్పు డొక్క చించేస్తానని. నాకే కొడుకులూ లేరు. నాకు పెళ్ళయినా నే నెవర్నీ దత్తత చేసుకోను. (బాబ్జి మెల్లిగా లోపలి కెళ్ళిపోయేడు) ఎవడైనా నన్ను నాన్నా అని పిలిస్తే వళ్ళు చీరేస్తాను. పొండి. అందరూ దొంగలే.

శ్రీను : బాగా ఆలోచించి మాట్లాడండి డాడీ ! ఈ వయస్సులో ఉద్రేకపడటం సహజమే. కానీ—

చిట్టి : (ఉడుక్కున్నాడు) నాకెంత వయస్సని నీ ఉద్దేశం. నీకంటె ఏడాది పెద్దవాణ్నేమో అంతేగా.

శ్రీను : నో మై డియర్ డాడీ ! ఆవేశపడకండి. మా బాధ నర్థం చేసుకోండి. నా కథ వినండి.

చిట్టి : వినడాని కేముంది. నువ్వూ సుబ్బారావులాగా ఎవరో అప్పల నరసమ్మని ప్రేమించిఉంటావ్.

శ్రీను : ఎగ్జాక్ట్లీ డాడీ ! కానీ ఆ అమ్మాయి పేరు పద్మావతి. రెండు జడల పద్మావతి. తెలుగు మాస్టారమ్మాయి.

చిట్టి : మీ అన్నయ్య అడ్డు తగిలేడు. అతను వేదాంతి. పెళ్ళిమీద మోజులేదు.

శ్రీను : కరెక్ట్ డాడీ ! కానీ అన్నయ్య చదువు యింకా పూర్తికాలేదు. వాడింకా ఎన్నేళ్ళు చదువుతాడో తెలీదు. ఈ పరిస్థితుల్లో మీరు నన్ను గూడా దత్తత చేసుకోక తప్పదు.

చిట్టి : నో.

శ్రీను : ప్లీజ్ డాడీ ! మీరు దయామయులని తెలుసు. మీరు నామాట అంగీకరిస్తారనీ తెలుసు. కాపోతే కొంచెం పట్టు. కొడుకుల ముందు అదెంత సేపుంటుందిలెండి. మేము మారాముచేస్తే చెప్పవలసిన మీరే మారాము చేస్తున్నారా డాడీ !

చిట్టి : నేను సుబ్బారావుని గూడా దత్తత చేసుకోను. మీరిద్దరూ అరిచి గీపెట్టి చచ్చినా సరే నాకీ తంతు వద్దు. మనశ్శాంతి ఉండనివ్వండి. వెళ్ళండి.

శ్రీను : మనశ్శాంతి. మమ్మల్ని దత్తత చేసుకుంటే మీకు మనశ్శాంతి ఉండదా డాడీ ! మేము మీ మనసుని తినేస్తామా డాడీ ! ఆలోచించండి. మీరలా సాయం సమయాల్లో రోడ్డువెంట షికారు కెడుతున్నప్పుడు అటుపక్క, యిటుపక్క జనం మిమ్మల్ని చూచి ఆనందంతో అంటారు. "లుక్. ఆయనే చిట్టిబాబుగారంటె. ఇద్దరు పిల్లలు. ఇద్దరూ ఇంజనీర్లే. పెద్దాడు భిలాయ్. రెండోవాడు ఎన్‌సాగర్. ఆయనకేమిటి తక్కువ. కాలుమీద కాలేసు కూర్చోవచ్చు." ఇంత గౌరవం మావల్ల మీకు వస్తుంది. మీరు డీస్ని కాదంటె ఎల్లా డాడీ? మీ అందమైన జీవితాన్ని మీరే పాడుచేసుకుంటున్నారన్నమాట. ఇది తెలిపితక్కువతనమని చెప్తాను.

చిట్టి : నువ్వేమైనా చెప్పు. నేనేమీ వినదల్చుకో

ఉగాది

ఏమన్నవి? ఏ మన్నవి?
చేదుపూల మధువు పిండు
తేనెటీగ లే మన్నవి?
బ్రతుకు బరువులో హాయివి
బడయు మెరిగి కొమ్మన్నవి!
ఏమన్నవి? ఏమన్నవి?
మోడు మ్రాకు లేమన్నవి?

కష్టమయం శౌశిరము
గడువగనే నవవసంత
మరుగుదెంచు మన్నన్నవి!
ఆశ నిలుపు కొమ్మన్నవి!!

ఏమన్నవి? ఏమన్నవి?
ఎలకోయిల లేమన్నవి?
ప్రణయగీతితో జంటను
పరవశింపుమని యన్నవి!

ఏమన్నది ఏమన్నది?
ఈ ఉగాది యేమన్నది?
అవనిలోన తీపి చేదు
ఆస్వాద్యములే యన్నది!

ఏమన్నవి? ఏమన్నవి?
మల్లె మొగ్గ లేమన్నవి?
అరవిరిసిన వలపులోని
పరువమ్ములు కనుమన్నవి!

ఏమన్నది? ఏమన్నది?
ఈ వసంత మేమన్నది?

జీవితమున నవ వసంత
శోభ గూర్చు కొమ్మన్నది!
బ్రతుకు మల్లె పందిరియై
పరిమళించవలె నన్నది!
పరమళించవలెనన్నది !!

—పిక్కిలంక లక్ష్మీపతిరావు

సొగసైన
కురులు

రీటా

ఒత్తుగా, అందంగా జుట్టును పెంచుతుంది

ఒకరి శిరోజ సౌందర్యంచూచి
మరొకరు ఇక ఎంతమాత్రం
అసూయపడవలసిన అవసరం
లేదు. రీటా వాడి మీ కురుల
సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి.

వీటో కంపెనీ. మద్రాసు 1

R-22.TG

ఏజంటు : నగరి ఏజన్సీస్, విజయవాడ—1.

సలహా

క్షీణించియున్న ఆనందం, బలం, శక్తిని తిరిగి
యిచ్చేందుకు ఆహ్లాదకరమైనది. నరాల బలంకు
పైపూతకు వాడే తైలం. 1 సీసా రు 11-50
స్పెషల్ రకం అర్జంటు గుణంకు రు. 27/-
ఎడ్వాన్సు పంపుతూ జవాబుకు కవరు పంపాలి.

డాక్టర్ రత్నం సన్స్,
Sex Specialists (Estd 1904)
ఆజంపురా మార్కెట్ వద్ద, మలకపేట బిల్డింగ్స్
హైదరాబాద్-36 (ఆంధ్ర ప్రదేశ్)

వాంటెడ్ ఫాదర్స్

లేదు. నా బ్రతుకేదో నన్ను బ్రతుకనివ్వండి. అదే పదివేలు.

శ్రీను : పోనీ యీ ప్రశ్నకి జవాబు చెప్పండి డాడీ! మీరు రాధమ్మగారి మాట తీసేయగలరా ? ఆవిడమాటకి ఎదురు చెప్పగలరా ?

చిట్టి : అఫ్‌కోర్స్. చెప్పలేను. అవుతే,

శ్రీను : ఏంలేదు. నే నిప్పుడు మమ్మీ దగ్గర కెళ్లాల్సి ఉంటుంది. వెళ్లి 'మమ్మీ మమ్మీ! డాడీతో నా దత్తత విషయం చెప్పండి నే నిలాటి దుస్థితిలో ఉన్నానాటా' ని చెప్తాను. అప్పుడు ఆవిడ నాపట్ల జాలిని ప్రదర్శించి ఆవళంగా మిమ్మల్ని పిలిపించి 'చిరంజీవి శ్రీనివాసులు, మన రెండో అబ్బాయ్ చెప్పింది బాగున్నది గనక మీరు వప్పుకోక తప్పద' ని అంటుంది. మమ్మీ మాట మీకు వేదవాక్కు. మాట తీసేస్తే మీ మనసు బాధపడుతుంది. పైగా—యీ చిన్న విషయాన్నే కాదన్న మీరు రేపు మమ్మీని సుఖపెడతారనే నమ్మక మేమిటి ? అంచేత మమ్మీ మిమ్మల్ని పెళ్లిచేసుకోనని ఖచ్చితంగా చెబుతుంది. కాబట్టి ఏతావాతా తేలిందేమిటయ్యాం టే—

చిట్టి : షటప్. నాకు పిచ్చెత్తుతుంది.

శ్రీను : డాడీ ! ఒక పిచ్చేనా ? పిచ్చి ముదిరి మంచి క్లయిమాక్సు కొచ్చి మీ పీకని మీరే నులిమేసు కుంటారు. ఇదంతా ఎందుచేత, రాధమ్మని మీరు పెళ్లిచేసుకోలేకపోవడంచాత. అదెందుచాత, మమ్మల్ని దత్తత చేసుకోలేక పోవడంచాత. అదెందుచాత.

చిట్టి : నా ఖర్మ కాలడంచాత. మొత్తానికి నాచేత ముప్పైమూడు చెరువుల నీళ్లు తాగించేస్తున్నారు మీరు. వెళ్లండి. ఈనాటినుంచి మీ రిద్దరూ నా కొడుకులే. చిరంజీవి సుబ్బారావు మొదటి కొడుకు, చిరంజీవి శ్రీనివాసులు రెండో కొడుకని వప్పుకున్నాగా ! వెళ్లింక.

శ్రీని : థాంక్స్ డాడీ ! థాంక్స్.

(శ్రీనివాసులు వెళ్లిపోయాడు. బాబ్జీ ఓ బోర్డు వీ తన వెనగ్గా దాచి తీసుకొచ్చేడు.)

బాబ్జి : కాబట్టి దీని విషయ మేమిటో మా హెడ్‌క్లార్కు—కాదు—మిష్టర్ ధనుంజయరావ్ చెప్పేరు. ఇప్పుడు నా రెండు ముక్కలు.

చిట్టి : (ఏడుపొచ్చింది) ఒరేయ్ ఒరేయ్—మీరంతా కలిసి నన్ను చంపుకుతింటున్నార్రోయ్ ! నేను పారి పోతాను.

బాబ్జి : డబ్బు కావాలి. సుఖం కావాలి. ఉద్యోగం కావాలి. పెళ్లి కావాలి. పెళ్లాం కావాలి. ఇల్లు **కావాలి. స్థలం కావాలి. అప్పు కావాలి. ఇలాగ—మనిషి** అనే ఒకేఒక వస్తువుకి సవాలక్ష కోరికలు. ఈ కోర్కెలు తీరేందుకు మార్గాలూ ఉన్నాయి. కొన్ని ఆచరించదగ్గవీ, మరికొన్ని కానివీను. 'నాన్నలు కావాలి' 'వాంటెడ్ ఫాదర్స్' ఈ నినాదం ఈమధ్య కొంచెం విజృంభించింది. ప్రేమ అనే వస్తువు చుట్టూ అనేకమైన ప్రతిబంధకా లుంటాయి. అన్నింటినీ జయించి ప్రేమ ఫలించే రోజొచ్చేసినా కొసమెరుపన్నట్టు ఇంట్లో పెళ్లికాని పిల్లలు మరి కొంతమంది ఉండి ఉంటారు. అలాంటప్పుడు **ఆ యింటినుంచీ, ఆ కుటుంబ సభ్యత్వంనుంచీ** తప్పుకోచ్చేయాలి. న్యాయంగా పోచ్చేందుకు దత్తత అనే మార్గం ఉంది. అందుచేతనే మేమింత ధైర్య ముగా చెప్పగలుగుతున్నాం.—ఇలాంటి అవస్థల్లో ఇరుక్కున్న యువకులకు మేము వో మహదవకాశాన్ని యివ్వబోతున్నాం. ఇక్కడ నాన్నలు దొరుకుతారు. అన్ని రకాల నాన్నలూ దొరుకుతారు. (బోర్డు చూపించేడు. దానిమీద—'ఇక్కడ నాన్నలు దొరుకు తారు'—అని రాసి ఉంది.) ఆంధ్రదేశంలో యువ కుల ప్రేమ వర్ధిల్లాలి. ఆ ప్రేమలో బాటు ప్రతి బంధకాలూ వర్ధిల్లాలి. మా అవసరం వాళ్లకి రావాలి.

చిట్టి : ఛీ .... ఛీ ... యిక్కడ నేనో క్షణమైనా ఉండలేను ....పోతున్నాను.

(చిట్టిబాబు గుమ్మం దగ్గరికి వెళ్లి తక్కున ఆగిపోయేడు. రాధ వచ్చింది. రాధ రాకతో చిట్టి బాబులో మార్పు వచ్చింది. అత నిప్పుడు కొంచం కుదుటపడ్డాడు. వాళ్లిద్దర్నీ చూచి బోర్డు కుర్చీ వెనక దాచి బాబ్జీ లోపలికి వెళ్లిపోయేడు.)

చిట్టి : ఇవాళ ఎవడి మొహం చూశానో గానీ మన సంతా గందరగోళమైంది రాధా !

రాధ : ఏం జరిగిం దేమిటి ?

చిట్టి : ఒక విషయం చెప్తావా రాధా ? నీకు పిల్లలంటే యిష్టమా కాదా ?

రాధ : అదేం ప్రశ్న ?

చిట్టి : రేప్పొద్దున మన పెళ్లయిం తర్వాత పిల్లలుంటారు గదా ?

రాధ : ఉండనీండి. పిల్లలన్నా పువ్వులన్నా యిష్టం లేని ఆడదుంటుందాండీ ఎక్కడైనా ?

చిట్టి : అంతే కూర్చో ముందు.

రాధ : (కూర్చుంది.)

చిట్టి : ఇప్పుడు చెప్పు మన పిల్లలు ప్రయో జకులైతే మనకెంత ఆనందంగా ఉంటుంది ?

రాధ : బ్రహ్మానందంగా ఉంటుంది.

చిట్టి : పెద్దకొడుకు ఎం. ఇ., భిలాయ్‌లో ఉన్నాడు. రెండో కొడుకు బి. ఇ., యన్. సాగర్‌లో ఉన్నాడు.

రాధ : బాగానే ఉంది గానీ యిద్దరూ ఇంజనీర్లేనా ? వెరైటీకోసం ఒకడ్ని మెడిసిన్ చదివిద్దాము.

చిట్టి : అది కుదరదు.

రాధ : భలే. మీ యిష్టమేనేమిటి అంతాను!

చిట్టి : దేవుడు రాసిందాన్ని తప్పించలేము రాధా ! అది మన తరంకాదు.

రాధ : మనిద్దరి పిల్లలూ ఇంజనీర్లనే చెప్పేడా దేవుడు.

చిట్టి : చెప్పడమేమిటి నాన్‌సెన్స్. వాళ్లిద్దరూ ఇంజనీర్లే. ఒకడు భిలాయ్. రెండోవాడు యన్.సాగర్.

రాధ : చాలా దూరంగా ఉన్నారంటే !

చిట్టి : వెధవల్ని అండమాన్ పంపిస్తే యింకా బాగుండేది.

రాధ : అదేం మాటండి బొత్తిగా !

చిట్టి : నీకు తెలీదు రాధ ! వాళ్లిద్దరూ రెండు రాక్షసులు.

రాధ : (కోపం వొచ్చింది.) మరీ చోద్యంగా మాటాడేస్తున్నారు. మనకి పెళ్లి కాలేదు. ఏంలేదు. అప్పుడే యిద్దరు కొడుకులు. ఇద్దరూ ఇంజనీర్లే భిలాయ్, సాగరూ, రాక్షసులూ. ఏమిటి వరస ?

చిట్టి : పిచ్చి రాధా ! నీకేం తెలీ దసలు ! నీ కెలా చెప్పాలో అర్థంకావడంలేదు. పెద్దాడున్నాడు చూడు వాడు మిసాల పోలీసాఫీసరు కూతురు జ్యోత్స్నని ప్రేమించేడు.

రాధ : ఎవరు ? మా జ్యోత్స్ననే ! రేడియోలో పాడుతుంది !

చిట్టి : ఆహా ! అక్షరాలా ఆ అమ్మాయినే. రెండో వాడు రెండు జడల పద్మ, మన తెలుగు మాస్టారమ్మాయిని ప్రేమించేడు.

రాధ : ఏమండీ ? మీరే జన్మ గురించి మాటాడు తున్నారు. మన పిల్లలేమిటి, వాళ్ళిద్దర్ని ప్రేమిం చడ మేమిటండీ బాబూ ! మీకేం పిచ్చెత్త లేదుగదా ?

చిట్టి : ఇంతకుమునుపు నిక్షేపంలా ఉన్నాను. మన పిల్లలొచ్చి నా మనసు పాడుచేశారు.

రాధ : (చిట్టిబాబుని పట్టుకు కుదిపింది. కళ్ళ ల్లోకి తిన్నగా చూచి అడిగింది) నాకు భయంగా ఉంది. మీరలా మాట్లాడొద్దు. మన పిల్లలు రావడ మేమిటండీ ? అసలేం జరిగిందండీ ?

చిట్టి : (రాధ చేతులు తొలగించుకున్నాడు) నేను నిజమే చెప్తున్నాను రాధా ! నిజమే చెప్తున్నాను. మా సుబ్బారావు మన పెద్ద కొడుకు. శ్రీనివాసులు చిన్న కొడుకు చిరంజీవి రెండు.

రాధ : ఈమధ్య మాయదారి పుస్తకా లెక్కువ చద వటం మొదలెట్టారు మీరు. వెనక జన్మా, ముందు జన్మా వా శ్రాద్ధంను. చదివింది చదివినట్టు వదిలేయాలి గాని మనసులో పెట్టుకుంటార్టండీ ఎక్కడైనా ? రామరామ.

చిట్టి : (గట్టిగా అరిచేడు) రాధా, నే చెప్పేది విను. పూర్తిగా విను. అసలేం జరిగిందంటే మొట్టమొదట సుబ్బారావొచ్చి నన్ను 'నాన్నా' అని పిలిచేడు.

రాధ : అదేం పాపం.

చిట్టి : ఛ. ఫో వెధవా అని కూకలేశాను. తర్వాత చెప్పేడు. జ్యోత్స్నని పెళ్ళిచేసుకోడానికి అందరూ ఒప్పుకున్నార్ట. వాడి అన్నయ్యొకడు వేదాంతంలో మునిగి పెళ్ళొద్దూ పెళ్ళామొద్దూ అని కూర్చు న్నాట్ట. అతనికి పెళ్ళికాందే, వీడికాదు. అయ్యిందా —అంచేత ఆ యింటి నుంచి వొచ్చేసి మనకి దత్తతగా వొచ్చేస్తాట్ట. మనం వాడి పెళ్ళి చేయాలిట. కాబట్టి వాడో మన మొదటి కొడుకు. రెండు శ్రీనివాసులు. డిటో కేసు, డిటో బాధ. కొంచెం తేడాలు. నన్నే ఆశ్రయించేడు. ముందేదో నవ్వులాటగా తీసు కున్నాను. కానీ బెదిరించి మరీ నాచేత వొప్పించేరు. మనకిప్పుడు ఇద్దరు కొడుకులు రాధా ! ఇద్దరు. అయ్య బాబోయ్ ఇద్దరు.

రాధ : బాగుంది వరస. ఇప్పుడు నన్నేం చేయ మంటారు.

చిట్టి : నే నొప్పుకున్నాను. నువ్వూ ఒప్పుకుంటే.

రాధ : మరి మన పెళ్ళి కాలేదుగా యింకా.

చిట్టి : ఆషాఢమాసం వెళ్ళిం తర్వాత లగ్నా లున్నాయిటగా.

రాధ : ఉన్నాయిట.

(బాబ్జి రెప్పపాటులో వాళ్ళిద్దరిముందూ ప్రత్యక్ష మయ్యేడు. అతని చేతిలో యిప్పుడు ఫైలొకటి ఉన్నది.)

బాబ్జి : స్టాప్ రాధగారు. కొంచెం ఆగండి (సీరి యస్‌గా అడిగేడు.) అపునూ—ఆషాఢ మాసమంటే ఎన్నినెల లుంటుందోయ్ చిట్టిబాబూ !



హాంటెడ్ ఫాదర్స్

రాధ :(నవ్వబోయి ఆగిపోయింది.)

చిట్టి : (కొరకొర చూసేడు) ఎన్నినెల లేమిటి నీ బొంద. మాసమంటే మంత్. నెల.

బాబ్జి : బాగుంది. అయితే నెల రోజుల తర్వాత మన సంస్థ ప్రారంభించవోచ్చన్నమాట. (ఫైలుతీసి ఏదో చూసేడు.)

చిట్టి : వీడొకడు రాధా ! వాడి పిచ్చితో నాకు పిచ్చెత్తించేస్తున్నాడు.

రాధ : ఏమిటండీ ఆ సంస్థ.

బాబ్జి : (ఫైలు మూసి సీరియస్‌గా అన్నాడు) రాధగారూ ! మీరైనా నన్ను సరిగ్గా అర్థం చేసుకుంటారని ఆశిస్తాను. మీరు సావధానంగా వినండి. పెళ్లయిన వాళ్లు పెళ్లి కానివాళ్లకి సాయం చేయాలి. వంద అబద్ధాలైనా చెప్పి ఒక్క పెళ్లి చెయ్యమన్నారు. మనం చేయబోయే బిజినెస్‌లో ఒక్క అబద్ధమైనా లేకుండా వంద పెళ్ళిళ్లు జరిపిస్తాం.

రాధ : మనం చేయబోయే బిజినెస్సా ?

బాబ్జి : నా మాటకి అడ్డు రాకండి రాధగారూ ! నన్ను పూర్తిగా చెప్పనివ్వండి. మీరు చిట్టిబాబుని పెళ్లి చేసుకుంటున్నారు. నేనూ ఎవర్నో ఒకర్ని చేసుకోక తప్పదుకదా. అవునాండి. ఇప్పుడు మీ రిద్దరూ, మేమిద్దరం మొత్తం మనం నలుగురం యీ బిజినెస్‌లో భాగస్థులవుతాం. ఇహ బిజినెస్సేమిటంటే (ఇందాక దాచిన బోర్డు పైకి తీశాడు. రాధకి చూపించేడు) "ఇక్కడ నాన్నలు దొరుకుతారు" నాన్న అవసరం ఎంతటిదో, ఎందరికా అవసరం కలుగుతుందో మీ కిప్పుడే తెలుస్తోంది. నాకు భవిష్యత్తు తెలుసు. నా మెదడులో అన్నీ ఏర్పాటు చేసుకున్నాను. సంతకాలు చేయడం, నియమాలు రాసుకోడం మిగిలిపోయింది. (బోర్డు కింద పెట్టి ఫైలు తీశాడు) మీరు వూఁ అన్నారూ అంటే నిమిషంలో అంతా సిద్ధం చేస్తాను. రేపీవేళకి పేపరు పబ్లిసిటీ—

చిట్టి : నోర్ముయ్.

రాధ : చెప్పనివ్వండి.

చిట్టి : రాధా ! నీకు తెలీదు. వీడుత్త పిచ్చి వెన్నాసి. వాళ్ల హెడ్‌క్లార్కుని తిడుతున్నప్పుడు నువ్వినలేదు.

బాబ్జి : నాకోపం తెప్పించకు. చిట్టిబాబూ ? చూడండి రాధా ! ఉద్యోగం చేయడంకంటె వ్యాపారం పెట్టుకోడం మంచిదని నా ఉద్దేశం. ఆ వ్యాపారాన్ని అందంగా వూహించుకోడం తప్పు కాదుగదా. ఇది వీడికి గిట్టదు. నాకు పిచ్చెత్తిందని పిచ్చి ప్రచారం చేస్తున్నాడు.

(అంతలో సుబ్బారావూ, శ్రీనివాసులూ ఇద్దరూ వచ్చేరు. ఇద్దరి చేతుల్లోనూ పూలదండ లున్నాయి.)

శ్రీను : గుడ్‌మార్నింగ్ మమ్మీ !

రాధ : (ఉలిక్కిపడింది. చిట్టిబాబువేపు బిత్తరపోయి చూచింది.)

సుబ్బా : మా అదృష్టం పండింది. సాక్షాత్తూ దైవస్వరూపు లిద్దరూ యిక్కడే ఉన్నారు. ఏదో మాకు తోచిన యీ కొద్ది సన్మానంతో....

చిట్టి : సన్మానమూ వొద్దూ, శ్మశానమూ వొద్దు. పొండి. ముందిక్కడ్నుంచి కదలండి.

శ్రీను: డాడీ! విసుక్కోకండి. మీ రిచ్చిన మాట నిలుపుకోండి. మాట తప్పకండి. అనవసరంగా మనసు పాడుచేసుకోకండి..

సుబ్బా : ఇది నా ప్రేమ అనే పూలదండ. స్వీకరించండి నాన్నగారూ ! (దండని చిట్టిబాబు మెళ్లో వేశాడు.)

శ్రీను: ఇదిగూడా తీసుకుని మమ్మీ కివ్వండి డాడీ! (దండ నిచ్చేడు.) ఇప్పుడు మీ రిద్దరూ ఒకరి పక్కన మరొకళ్లు నించోండి.

సుబ్బా : కరుణించిన దేవతలకి పాదాభివందనం చేస్తున్నాం.

చిట్టి : ఏడవలేకపోయేరు ! (దండల్ని తీసి విసిరి పారేయబోయేడు.)

బాబ్జి : వద్దురా చిట్టిబాబూ! పారేయకు. పూలు నలిగిపోతాయి.

చిట్టి : చూశావా రాధా, వీళ్లందరూ కలిసి నన్ను చిత్రహింస చేస్తున్నారు. నువ్వలా బొమ్మలా నుంచోవద్దు రాధా ! చెప్పు .... మనం ఎవర్నీ ఎప్పుడూ దత్తత చేసుకోమని చెప్పు రాధా !

శ్రీను : నో మమ్మీ. వద్దు.

సుబ్బా : అమ్మగారు నాన్నగారిలా మనసులేని మనిషిగాదు. ఎంతైనా తల్లి ! ఆడమనసు రాయి కాదు.

రాధ : (బిక్కుబిక్కుమంటూ అన్నది) నన్ను కొంచెం ఊపిరిపీల్చుకోనివ్వండి.

శ్రీను : భలే. రండి. ఇలా వొచ్చి కూర్చోండి మమ్మీ. వోరే అన్నయ్యా విసినకర్ర పట్రా.)

సుబ్బా : ఈ పాడుకొంపలో అవి దొరకవురా తమ్ముడూ !

రాధ : (కూర్చుంది) ఒకవిధంగా నేను మీ యిద్దరికీ ఋణపడి ఉన్నాను.

సుబ్బా : అమ్మమ్మ! అమాటనకండమ్మా ! అమ్మ కొడుకుల కెప్పుడూ ఋణపడి ఉండదు.

రాధ : కాదు. నిజంగానే ఋణపడి ఉన్నాను. నాకో మార్గం చూపించేరు మీరు. మనమంతా ఒకే జాతి మనుషులం. నిన్న మొన్నటివరకూ మాఅక్కయ్య పెళ్లవుతుందని అందరం అనుకున్నాం. మేమిచ్చే కట్నం చాలదని ఉత్తరం వచ్చింది. అనుకున్న దానికంటే కాణీ గూడా ఎక్కువ యివ్వనని మొండికెత్తేరు నాన్న. అక్కయ్య పెళ్లాగి పోయింది. అక్కయ్య పెళ్లి జరుగుతేనే గాని నా పెళ్లి జరగదు.

బాబ్జి : (ఆనందంగా అన్నాడు) బ్రహ్మాండం. ఎక్సలెంట్. వండర్‌ఫుల్.

చిట్టి : రాధా! నువ్వు చెప్పేదంతా నిజమేనా ?

శ్రీను : మమ్మీ ! మమ్మల్ని అన్యాయం చేయకండి. పూర్తిగా మిమ్మల్నే నమ్ముకునాం. నట్టేటో ముంచకండి. మీరు నాన్నగార్ని పెళ్లిచేసుకోవాలి. మా పెళ్లి మీ రిద్దరూ చేయించాలి.

సుబ్బా · లేదురా ! అమ్మగారు 'జోక్' చేస్తున్నారు. నాకు తెలుసుగా.

రాధ : (పేలవంగా నవ్వింది.) లేదు. నేను నిజమే చెప్తున్నాను. ఈమాట చెప్పడానికే యిలా వొచ్చేను.

బాబ్జి : దెన్. మీరు గూడా 'హాంటెడ్ ఫాదరో' నన్నమాట! వెరీగుడ్.

చిట్టి · నువ్వు నోరుమూసుకో. నన్ను కొంచెం ఆలోచించనివ్వు.

బాబ్జి : ఆలోచించేందు కేముంది చిట్టిబాబూ! రాధగారు గూడాను—

సుబ్బా : అయ్య బాబోయ్. కథ అడ్డం తిరిగింది.

బాబ్జి : కరెక్ట్.

శ్రీను : ఎలా ? ఈ సమస్య నెలా సాధించాలి.

బాబ్జి : (గొంతు సవరించుకున్నాడు) కాబట్టి



వాంటెడ్ ఫాదర్స్

మీరంతా ఒకే పడవమీద గోదారిలో ప్రయాణం చేస్తున్నారు. మీరు ప్రయాణంచేసే పడవ అతి ప్రమాదమైన పరిస్థితుల్లో యిరుక్కుంది. తుఫాన్. నోడ్డుమీద మరతుపాకులు. పడవలో ఉన్న మనుష్యులందరూ నిస్సహాయులే. ఒకరికొకరు సాయం చేసుకునే స్థితిలో లేరు. చెప్పడం మరిచేను. అది రాత్రి. కాళరాత్రి. అమావాస్య. కాటుకలాటి చీకటి.

చిట్టి : గుండె లదరగొడుతున్నావురా బాబ్జి ! నీ సోది అవుతే కాసేపు ఆలోచనల్లో పడతాం.

బాబ్జి : పడొచ్చు. అందరూ కలిసి గోదాట్లోనే పడతారు. మీ కిప్పుడు ఒక మహత్తరమైన వ్యక్తి ప్రత్యక్షమై మిమ్మల్ని రక్షించాలి. ఆ వ్యక్తి ఎవరు ? అన్నదే మీ ప్రశ్న ? ఉన్నాడు. ఆ వ్యక్తి ఉన్నాడు.

చిట్టి : ఎవరు ?

సుబ్బా : ఒరేయ్ శ్రీనివాసులూ ! బాబ్జిగారికి పిచ్చన్నవాళ్లందరూ పిచ్చాళ్లే. లేపోతే ఎంత తెలివిగా మాటాడుతున్నారో చూడు.

శ్రీను : నిజం. నిజం. ఇన్నాళ్లూ బాబ్జిగార్ని అపార్థం చేసుకున్నాం. ఈనాడు—

బాబ్జి : సైలన్స్. ఏమిటా కాకిగోల ? నే చెప్పే మాట వినండి. నే చెప్పిన మహత్తరమైన వ్యక్తి ఎవరో కాదు—నేను.

సుబ్బా : (నీరసంగా అన్నాడు) నువ్వా బాబ్జి ?

శ్రీను : (ఎగతాళి చేశాడు) ఇంకా నయం, మీ హెడ్‌క్లార్కు అన్నావుకాదు.

చిట్టి : పోరా పిచ్చోడా ? నీ బిజినెస్ మా దగ్గర కాదు.

రాధ : చెప్పనివ్వండి.

బాబ్జి : మావయ్య కూతురు కామాక్షితో నాపెళ్లి స్థిరపడింది. ఆషాడమాసం నెల రోజులే అని చెప్పారు గనక ఆ నెలా గడిచిన వెంటనే మా పెళ్లి. మా పెళ్లవుతే—

చిట్టి : వూ .... పెళ్లవుతే.

బాబ్జి : రాధమ్మకి నేను నాన్నని. నువ్వు నా అల్లుడివి. అర్థమైందా ? కానీ—

చిట్టి : (చల్లబడిపోయేడు) మధ్యలో కానీ ఏమిటి మావగారూ ?

బాబ్జి : ఉన్నదోయ్ లిటిగేషన్. కామాక్షికి చెవుడు. అదొక్కటే నాకు నచ్చనిది.

చిట్టి : ఏడ్చావులే మావగారూ ! చెవుడేం పెద్ద అవలక్షణం కాదు. పైగా—ఆడాళ్లకు చెవుడుండటం మగాడికి మంచిది. చేసుకో. తొరగా చేసుకో.

బాబ్జి : చేసుకోను. మీ అందరికోసం నేనీ త్యాగం చేయలేను.

చిట్టి : ఇవి నీ చేతులు మావగారూ ! పట్టుకు బతిమాలుతున్నాను.

రాధ : మీ రుండండి. నిజానికి బాబూరావు నాన్నగారు చాలా మంచివారు. మీరే ఆయన్ని పాడుచేస్తున్నారు. నామాట నాన్నగారు కాదనరు.

బాబ్జి : అనలేను తల్లీ ! కాని నే చేయబోయేది త్యాగమమ్మా త్యాగం.

చిట్టి : వల్లకాడు మావగారు ! వోరేయ్ బాబ్జీ నాకోపం రానీకు. పెళ్లి చేసుకో! ఫర్లేదు.

బాబ్జి : చేసుకోన్నా—

చిట్టి : మరి నీ బిజినెస్సు ?

బాబ్జి : అఖిలాంధ్ర అప్పడాలు మరియు విస్తళ్ల తయారీ సంస్థ ఉందిగా.

చిట్టి : అది వద్దురా. దానికంటే లాభదాయకమైంది యీ బిజినెస్సే !

బాబ్జి : ఏదీ లాభం. నేను పెళ్లిచేసుకుని నో తండ్రి నవుతానని అరగంటనుంచీ చెబుతూంటే మీలో ఎవరైనా ఫీజుమాట ఎత్తేరా ?

శ్రీను : (నొచ్చుకున్నాడు) నా వంతు నూటపద హార్లు గ్రాండ్ ఫాదర్ కి.

సుబ్బా : తాతగారూ ! నేనూ అంతే ఇచ్చుకుంటానండి. మా అమ్మగార్ని దత్తత చేసుకోడానికి వప్పుకోండి.

బాబ్జి : మరి నువ్వోయ్ అల్లుడూ ?

చిట్టి: నాదో అనుమానం! పీకనులు పెళ్లంటూ—

బాబ్జి: ఆల్‌రైట్. నాకు పెళ్లికాదనే నమ్మకం మీకుంటే అందరూ వెళ్లిపోవచ్చు—నువ్వు మరో నాన్నని వెదుక్కో తల్లీ రాధ !

రాధ : (చిట్టిబాబుని మందలించింది) అబ్బబ్బ మీరు మరీను. నాన్నగారి మనస్సు నొప్పించకండి బాబూ!

చిట్టి : సరె. నేనూ నూటపదార్లు.

బాబ్జి : అయితే నేను మా కామాక్షిని పెళ్లి చేసుకుంటాను. రా .... రాధమ్మా, మా యింటి వెల్తురువి నువ్వు. ఇలా రావోయ్ అల్లుడూ. మా యింటి వెలుగుని నీ చేతుల్లో పెడుతున్నాను. నెత్తి నెట్టుకు పూజించు.

రాధ : నాన్నగారూ ! మీరెంత మంచివారండీ.

(పాదాభివందనం చేసింది. చిట్టిబాబుని కళ్లతో హెచ్చరించి అతనిచేత గూడా చేయించింది.)

బాబ్జి : వెయ్యేళ్లు ఆనందంగా వర్ధిల్లండి.

సుబ్బా : తాతయ్యా !

శ్రీను : బాబ్జి తాతయ్యా !

(ఇద్దరూ బాబ్జికి చెరోవేపు నించున్నారు.)

బాబ్జి : రెస్పాన్సు చూద్దామని కథల్లేను. మీరందరూ నా మనుషులేనని నన్ను ఆశ్రయించడం నాకు గొప్పగా ఉంది. నే పెట్టబోయే బిజినెస్సు ఇంత మనోహరంగా ప్రారంభమైందంటే నా కళ్లు తిరుగుతున్నాయి. కానీ నాకా ఛాన్సు లేదు. నాకూ నాన్నగారు కావాలి. నిజం.

(ఆదివారం ఉదయం ఆ ఒక్క మాటతో నీరసాన్ని అలంకరించుకున్నది. అందరూ బాబ్జివేపు హతాశులై చూసేరు.)